జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥ సంపుటి:1 ॥ సంచిక: 37 ॥ సోమవారం ॥ 6-7-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:50 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి షష్ఠి మ. 1:43 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం పూర్వాభాద్ర మ. 3:53 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం సౌభాగ్య మ. 3:45 వరకు కరణం వనిజ మ. 1:43 వరకు విష్టి రా. 1:38౦ వరకు వర్జ్యం రా. 1:49 నుండి తె. 3:26 వరకు దుర్ముహూర్తం మ. 12:46 నుండి మ. 1:38 వరకు మ. 3:22 నుండి సా. 4:14 వరకు రాహుకాలం ఉ. 7:28 నుండి ఉ. 9:05 వరకు యమగండం ఉ. 10:43 నుండి మ. 12:20 వరకు గుళికాకాలం మ. 1:58 నుండి మ. 3:35 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:14 నుండి తె. 5:02 వరకు అమృత ఘడియలు ఉ. 7:16 నుండి ఉ. 8:56 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:46 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున



## మెట్రో ఫేజ్-2కు వెంటనే అనుమతులు ఇవ్వండి

**కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ లేఖలు**

**ఫేజ్-1 ప్రక్రియ వేగవంతం చేయాలని విజ్ఞప్తి**

**జాప్యంతో వ్యయం పెరిగే ప్రమాదమని ఆందోళన**

హైదరాబాద్, జులై 5

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణకు తక్షణ అనుమతులు మంజూరు చేయడంతో పాటు, మెట్రో ఫేజ్-1ను తెలంగాణ ప్రభుత్వ ం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి లేఖలు రాశారు. ఇటీవల జూన్ 23, 24 తేదీల్లో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నతస్థా యి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి లేఖల్లో ప్రస్తావించారు. మెట్రో ఫేజ్-1 ఆస్తుల (మిగతా 2వ పేజీలో)

## హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం

**361 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు**

**ఉపాధి ఉన్న ప్రాంతంలోనే గృహాల నిర్మాణం**

**పాత ప్రభుత్వ గృహాల సర్వేకు ఆదేశం**

రాష్ట్రంలోని ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు గౌరవప్ర దమైన శాశ్వత నివాసం కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు.



హైదరాబాద్, జులై 5

ఆదివారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైనారిటీల సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా తదితరులతో కలిసి - 2వ పేజీలో



## కన్నెపల్లి పంప్‌హౌస్‌కు... కేటీఆర్ బృందం

**కంచెలు దాటి పంప్‌హౌస్‌కు చేరుకున్న నేతలు**

**కాళేశ్వరం వద్దబీఆర్ఎస్ ఆందోళన**

**ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన కేటీఆర్**

**భారీ సంఖ్యలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు**

జయశంకర్ భూపాలపల్లి, జులై 5

పోలీసులు ఏర్పాటు చేసిన కంచెలను దాటి పంప్‌హౌస్‌కు చేరుకున్న కేటీఆర్, అక్కడి పరిస్థితులను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తుండగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా (మిగతా 2వ పేజీలో)



## శ్రీరాంబాగ్ బస్తీలో ఓపెన్ జిమ్ ప్రారంభించిన కిషన్ రెడ్డి

**ఫిట్ ఇండియా స్ఫూర్తితో ఆరోగ్యంపై అవగాహన**

**ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపు**

**స్థానికుల కోసం ఆధునిక వసతులతో జిమ్ ఏర్పాటు**

హైదరాబాద్, జులై 5 (

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డి ఆదివారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని మల్లేపల్లి డివిజన్ పరిధిలోని శ్రీరాంబాగ్ బస్తీలో పర్యటించారు. (మిగతా 2వ పేజీలో)




## కాళేశ్వరం బ్యారేజీలకు శాస్త్రీయ పునరుద్ధరణ తప్పనిసరి

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీలను తిరిగి నిర్వహించాలంటే శాస్త్రీయ పునరుద్ధరణ తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందేనని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశా రు. ఆదివారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.


**మూడు బ్యారేజీల పునాదులపై అనుమానాలు**

**భద్రతకే తొలి ప్రాధాన్యం.. బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు**

**నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్, జులై 5 (

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ భద్రతపై తీవ్రమైన అనుమానాలు ఉన్నాయని అన్నారు. మూడు బ్యారేజీల పునాదులు బలహీనంగా ఉన్నాయని, నిర్మాణపరమైన లోపాలపై నిపుణుల పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. అన్ని సాంకేతిక సమస్యలను పూర్తిగా పరిష్కరించిన తర్వాతే వాటి నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనా ల కోసం ఇంజినీరింగ్ భద్రతా ప్రమాణాలను పక్కన పెట్టిందని ఉత్తమ్ ఆరోపించారు. ప్రజాధనం, ప్రజల భద్రతతో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. శాస్త్రీయ ప్రమాణాల



## నేను మూడోసారి అధ్యక్షుడిని!

**అమెరికా వేడుకల్లో డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**

**బైడెన్ గెలుపు తనదేనంటూ వివాదాస్పద కామెంట్స్**

వాషింగ్టన్, జులై 05: వివాదాస్పద వ్యాఖ్యలతో నిరంతరం వార్తల్లో నిలిచే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని శనివారం ఏర్పాటు చేసిన ఒక బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. తాను అమెరికా అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించడంలో ఇది మూడోసారి అని చెప్పుకొన్నారు. నిజానికి ఆయన అధికారికంగా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారే అయినప్పటికీ.. 2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ తన విజయాన్ని దోచుకున్నారని ఆయన పలు సందర్భాల్లో ఆరోపించారు. ఆ ఎన్నికను కూడా -2 వ పేజీలో...



## ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్రం నోటీసులు

**అభ్యంతరకర ప్రకటనలపై ఆగ్రహం**

**వారంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశం**

**చట్టపరమైన చర్యల హెచ్చరిక**

పిల్లలకు సంబంధించిన అభ్యంతరకర ప్రకటనలు ప్రసారమవుతున్నాయన్న ఆరోపణలపై ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటాకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. అభ్యంతరకర ప్రకటనలను తక్షణమే తొలగించాలని ఆదేశి ంచిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ, ఈ వ్యవహారంపై పూర్తి వివరణను వారం రోజుల్లోగా సమర్పించాలని సూచించింది.

**ఇటీవల** ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దోపిడీని ప్రోత్సహించేలా కనిపిస్తున్న చెల్లింపు ప్రకటనలు ప్రసారమవుతున్నట్లు వెలుగులోకి రావడంతో కేంద్రం ఈ విషయా న్ని తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి కంటెంట్‌ను వెంటనే తొలగించడంతో పాటు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యలను వివరించాలని మెటాను ఆదేశించింది. ఈ అంశంపై ఇటీవల అంతర్జాతీయ మీడియా కథనం వెలువడిన అనంతరం తరువాయి 2 వ పేజీలో...

## నేటి రాశి ఫలాలు

**మేషం :** మీ ప్రయత్నాలకు అనుకూల ఫలితాలు లభిస్తాయి. మిత్రుల సహకారంతో విజయం సాధిస్తారు. ఆనందకరమైన సమయం మీ సొంతం అవుతుంది. దత్తాత్రేయ స్వామి ఆరాధన మేలు చేస్తుంది.

**వృషభం :** లక్ష్యసాధనపై దృష్టి పెట్టండి. కుటుంబ వ్యవహారంలో సహనం వహించండి. అనవసర ఆలోచనలకు దూరంగా ఉండాలి. ప్రయాణాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి. శివారాధన శుభప్రదం.

**మిథునం :** దైవబలం కలిసి వస్తుంది. చిన్న చిన్న ఆటంకాలను ఎదురైనా అధిగమిస్తారు. కార్యసిద్ధి కలుగుతుంది. సమాజంలో గౌరవం, గుర్తింపు పెరుగుతాయి. దుర్గాదేవి దర్శనం మేలు చేస్తుంది.

**కర్కాటకం :** ఆత్మవిశ్వాసం, నిబద్ధత విజయాన్ని అందిస్తాయి. స్థిరమైన నిర్ణయాలతో ముందుకు సాగండి. బంధువులతో సఖ్యతగా ఉంటే మంచిది. విమర్శలను ధైర్యంగా ఎదుర్కోండి. ఆంజనేయ స్వామి ఆరాధన శుభప్రదం.

**సింహం :** సానుకూల ఆలోచనలతో విజయాలు సాధిస్తారు. శుభవార్త మీ ఇంట్లో ఆనందాన్ని నింపుతుంది. ముఖ్యమైన పనుల్లో బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. శివారాధన మేలు చేస్తుంది.

**కన్య :** శుభకాలం కొనసాగుతుంది. బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తారు. కుటుంబ సభ్యుల సహకారంతో విజయాలు సాధిస్తారు. గురుచరిత్ర పారాయణం శుభదాయకం.

**తుల :** శుభయోగం ఉంది. అభివృద్ధి దిశగా అడుగులు వేస్తారు. ఉత్సాహంగా పనులు పూర్తి చేస్తారు. కుటుంబంతో ఆనందంగా గడుపుతారు. ఇష్టదైవారాధన ఉత్తమం.

**వృశ్చికం :** మిశ్రమ ఫలితాలు ఉంటాయి. కీలక నిర్ణయాల్లో జాగ్రత్తలు అవసరం. పెద్దల సలహాతో ముందుకు సాగితే మంచిది. ఆధ్యాత్మిక చింతన మనశ్శాంతినిస్తుంది. నవగ్రహ స్తోత్రం చదవండి.

**ధనుస్సు :** ఆత్మీయుల సహకారం విజయానికి దోహదం చేస్తుంది. వివాదాలను నివారించి సంయమనంతో వ్యవహరించాలి. సహనం మీ బలం అవుతుంది. శని శ్లోకం చదివి ఆంజనేయ స్వామిని దర్శించండి.

**మకరం :** శుభకాలం. ప్రారంభించిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కుటుంబంలో ఆనందం వెల్లివిరుస్తుంది. విష్ణు సహస్రనామ పారాయణం మేలు చేస్తుంది.

**కుంభం :** పట్టుదలతో కృషి చేస్తే విశేష ఫలితాలు పొందుతారు. వివాదాలకు దూరంగా ఉండండి. ఎవరినీ అతిగా నమ్మకపోవడం మంచిది. శనికి తైలాభిషేకం శుభప్రదం.

**మీనం :** ఓర్పు, ప్రణాళికతో ముందుకు సాగితే విజయం మీ సొంతమవుతుంది. ఖర్చుల్లో జాగ్రత్త అవసరం. ఆలోచించి మాట్లాడటం మేలు చేస్తుంది. శ్రీరామరక్షా స్తోత్రం పారాయణ శుభదాయకం.



# హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

361 మంది లబ్ధిదారులకు రెండు పడకగదుల ఇళ్ల పట్టాలు, తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తు న్న గృహ నిర్మాణ కార్యక్రమాలపై మంత్రులు వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా గృహాల కోసం ఎదురు చూసిన పేద కుటుంబాలు ఎదుర్కొన్న ఇబ్బందుల ను ప్రభుత్వం పూర్తిగా గుర్తించిందన్నారు. ఆ జాప్యానికి ప్రభుత్వ ప్రతినిధిగా విచారం వ్యక్తం చేస్తున్నానని, ఇకపై అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సొంతింటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన కుటుంబాలకు పట్టాలు అందించడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పేదల జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న నిరుపేదలు ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా, వారు పనిచేస్తున్న ప్రాంతాల్లోనే గృహాలు నిర్మించి అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఇందుకోసం అవస రమైతే విలువైన ప్రభుత్వ భూములను కూడా వినియోగించేందుకు వెనుకాడబోమన్నారు. హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణా న్ని లక్ష్యంగా పెట్టుకుని అధికారులు ఇప్పటికే కార్యాచరణ ప్రారంభి ంచారని, దశలవారీగా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహాలు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పేదల జీవనోపా ధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా గృహ నిర్మాణ విధానాన్ని రూపొందించామని చెప్పారు. ప్రభుత్వం గృహాలకే పరిమితం కాకుండా పేదల సంక్షేమాన్ని సమగ్రంగా అమలు చేస్తోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందజేస్తున్నామని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి 48 గంటల్లోనే కార్డులు జారీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామ ని పేర్కొన్నారు. రేషన్ కార్డులతో పాటు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వ ం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వివిధ శాఖల్లో ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. హైదరాబాద్ నగరంలోని పాత ప్రభుత్వ గృహ సముదాయాలు,వాంబే హౌసింగ్, జేఎన్ఎన్ యూఆర్ఎం తదితర పథకాల కింద నిర్మించిన భవనాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని మంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. నివా సయోగ్యం కాని భవనాలను వెంటనే ఖాళీ చేయించి, మరమ్మతులు చేయదగిన భవనాలను పునరుద్ధరించాలని, పూర్తిగా శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేసి కొత్తగా నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. భవనాలను మూడు విభాగాలుగా వర్గీకరించి సమగ్ర నివేదికను ప్రభుత్వం ముందుంచాలని అధికా రులకు స్పష్టం చేశారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజహరుద్దీ న్ మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి శాశ్వత గృహం కల్పించ డం సామాజిక న్యాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా మాట్లాడుతూ మొత్తం 361 గృహాలను లబ్ధిదారులకు కేటాయించినట్లు వెల్లడించారు. వీటిలో చాంద్రాయ ణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ మండలానికి చెందిన వారికి 187, నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్ మండలాని కి చెందిన వారికి 79, నాచారం కాలనీ ప్రాంతానికి చెందిన వారికి 95 గృహాలు కేటాయించినట్లు వివరించారు. ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, మాజిద్ హుస్సేన్ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాలు రాష్ట్రంలో సామాజిక భద్రతను మరింత బలోపేతం చేస్తాయని వారు అభిప్రాయపడ్డారు.

## మెట్రో ఫేజ్-2కు వెంటనే అనుమతులు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

విలువ నిర్ధారణ, అధిక వడ్డీ రుణాల పునర్వ్య వస్థీకరణ, ఫేజ్–2 విస్తరణకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు ఎస్‌బీఐ క్యాప్స్‌ను నోడల్ ఏజెన్సీ గా నియమించాలని అంగీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ఇప్పటి వరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఖరారు చేయకపోవడ ంతో పాటు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధికారిక బాధ్యతలు అప్పగించడ ంలో జాప్యం జరుగుతోందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆలస్యం వల్ల మెట్రో ఫేజ్–1 నిర్వహణలో ఇబ్బందు లు తలెత్తుతున్నాయని, ఫేజ్–2 డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీ కరణ ప్రక్రియ కూడా ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. జాప్యం కొనసాగితే ప్రాజెక్టు వ్యయం మరింత పెరిగే అవకాశం ఉందని సీఎం హెచ్చరించారు. హైదరాబాద్ భవిష్యత్ ప్రజా రవాణా అవ సరాలకు మెట్రో ఫేజ్–2 అత్యంత కీలకమని,అందువల్ల ఎలాంటి ఆలస్యం లేకుండా పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉ ందన్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరు కేంద్ర మంత్రులు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కోరారు. తద్వారా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు వేగంగా అమలై, మెట్రో ఫేజ్–1 స్వాధీనం ప్రక్రియ పూర్తికావడంతో పాటు ఫేజ్–2 విస్తరణ పనులు కూడా వేగంగా ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాళేశ్వరం వద్ద బీఆర్ఎస్ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి జీవనా డిగా నిలిచేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందన్నారు. అయి తే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో ప్రాజెక్టును నిర్ల క్ష్యం చేస్తోందని విమర్శించారు. సాంకేతిక సమస్యలను సకాలంలో పరిష్కరించకుండా రైతులకు సాగునీరు అందించే అవకాశాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజె క్టును రాజకీయాలకు వేదికగా మార్చడం సరికాదని అన్నారు. వృథాగా పోతున్న నీటి వద్దనే నిలబడి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు, పంప్‌హౌస్‌ల నిర్వహణలో ప్రభుత్వం పూర్తి గా విఫలమైందని, రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల సొమ్ముతో నిర్మిం చిన ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, దానిని విస్మరించడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమ ండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌తో పాటు పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యాయి. పంప్‌హౌస్ పరిసరాల్లో భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోవడంతో అక్కడ ఉ ద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయకుల పర్యటన ప్రశాంతంగా ముగిసేలా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కేటీఆర్ పర్యటనను పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు కాళేశ్వరం ప్రాజెక్టు పరిరక్షణకు సంబంధించిన నినాదాలు చేశారు.

## శ్రీరాంబాగ్ బస్తీలో ఓపెన్ జిమ్ ప్రారంభించిన కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాంలీలా గ్రౌండ్‌లో స్థానికుల వినియోగం కోసం ఏర్పాటు చేసిన ఆధునిక ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రజలు, యువతతో మాట్లాడి ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ,మారుతున్న జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవ డం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన "ఫిట్ ఇండియా" పిలుపు దేశవ్యాప్తంగా ఆరోగ్య చైతన్యాన్ని పెంచిందని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించడం ద్వారా అనేక జీవనశైలి వ్యాధుల ను దూరం చేసుకోవచ్చని సూచించారు. శ్రీరాంబాగ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఉపయోగపడేలా ఆధునిక పరికరాలతో రూపొందించబడిందని తెలిపారు. యువత శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు మహిళలు, వృద్ధులు కూడా ఈ సదుపాయాన్ని సద్వినియో గం చేసుకోవాలని కోరారు. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇలాంటి వసతులు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రభు త్వం ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సౌకర్యాలను కూడా విస్తరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. పార్కులు, ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు వంటి ప్రజా వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అన్నారు. స్థానికులు ఈ ఓపెన్ జిమ్‌ను పరిశుభ్రంగా ఉంచుతూ నిరంతరం వినియోగించు కోవాలని మంత్రి సూచించారు. వ్యాయామం కేవలం యువతకే కాకుండా అన్ని వయసుల వారికి అవసరమని, ప్రతి కుటుంబం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే భావనతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాళేశ్వరం బ్యారేజీలకు శాస్త్రీయ పునరుద్ధరణ తప్పనిసరి

మొదటి పేజీ తరువాయి

ప్రకారం పునరుద్ధరణ పనులు పూర్తి చేసిన తర్వాత మాత్రమే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ప్రజల భద్రత, ప్రాజెక్టుల స్థిరత్వం, ప్రజాధన పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. నిపుణుల సూచనలు, సాంకేతిక నివేదికల ఆధారంగానే అన్ని నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణలో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండదని ఉత్తమ్ స్పష్టం చేశారు. ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చేపట్టిందని మంత్రి వెల్లడించారు.

## నేను మూడోసారి అధ్యక్షుడిని!

మొదటి పేజీ తరువాయి

తన ఖాతాలోనే వేసుకుంటూ.. 'నిజానికి ఇప్పుడు నేను మూడోసారి అధ్యక్షుడిగా ఉన్నట్లు లెక్క. కానీ, వివాదాల జోలికి వెళ్లకూడదను కుంటున్నాను కాబట్టి.. నేను అలా అనను' అని నర్మగర్భంగా వ్యాఖ్యాని స్తూనే, అంతలోనే నవ్వుకుంటూ వివాదాస్పద అంశాల జోలికి పోవాలనుకోవట్లేదంటూ ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా అమెరికా ఎదిగిందంటే అది అనుకోకుండా జరిగిందేమీ కాదని, తాను మొదటిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు దేశ సైన్యాన్ని పునర్నిర్మించి, సైనిక సామర్థ్యాలను పెంపొందించడానికి ఎంతో కృషి చేశానని ట్రంప్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.

కాగా, 2020 ఎన్నికల్లో పరాజయం పాలైన ట్రంప్.. తన ఓటమిని అంగీకరించకుండా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఫలితాలను మార్చాలనే ఉద్దేశంతో పలు కీలక రాష్ట్రాల్లో వ్యాజ్యాలు దాఖలు చేసినప్పటికీ, తన ఆరోపణలను నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారు. మరోవైపు జో బైడెన్ ఎన్నికను కాంగ్రెస్ ధ్రువీకరించకుండా అడ్డుకునేందుకు 2021 జనవరిలో ట్రంప్ మద్దతు దారులు అమెరికా క్యాపిటల్ భవనంపై జరిపిన దాడి అప్పట్లో తీవ్ర వివాదానికి దారితీయగా.. ట్రంపే వారిని రెచ్చగొట్టారనే ఆరోపణలు వచ్చాయని ఈ కథనంలో పేర్కొన్నారు.

## ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్రం నోటీసులు

మొదటి పేజీ తరువాయి

విమర్శలు వెల్లువె త్తాయి. దీనిపై స్పందించిన కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, వెంటనే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించగా, ఆదివారం సంబం ధిత శాఖ మెటాకు అధికారిక నోటీసులు పంపింది. అభ్య ంతరకర ప్రకటనలు ఎలా అనుమతించబడ్డాయో, వాటి నియంత్రణకు ఎలాంటి వ్యవస్థ అమల్లో ఉందో వివరించా లని కేంద్రం కోరింది. అలాగే భవిష్యత్తులో ఇలాంటి కంటె ంట్‌ను గుర్తించి అడ్డుకునేందుకు అనుసరించబోయే విధా నాలపై కూడా స్పష్టమైన నివేదిక ఇవ్వాలని సూచించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపిస్తు న్న కొన్ని ప్రకటనలపై క్లిక్ చేస్తే ఇతర వేదికలకు మళ్లించి అభ్యంతరకర కంటెంట్‌ను అందిస్తున్నట్లు కేంద్రం గుర్తించి నట్లు సమాచారం. ప్రకటనల ద్వారా ఆదాయం లభిస్తున్నం దున వాటి పర్యవేక్షణ బాధ్యత నుంచి సంస్థ తప్పించుకోలే దని కేంద్రం స్పష్టం చేసింది. మెటా సమర్పించే వివరణ సంతృప్తికరంగా లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో పిల్లల భద్రతకు భంగం కలిగిం చే, చట్టవ్యతిరేక కంటెంట్‌పై కఠిన చర్యలు కొనసాగుతా యని అధికారులు తెలిపారు.

# శ్వేత సంపాదకీయం

**సోమవారం 6-7-2026**

## పార్లమెంట్ సమావేశాలపై కసరత్తు!

ఈ నెలాఖరులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే మరోమారు మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను పెట్టే యోచనలో కేంద్రం ఉంది. అయితే గత సమావేశాల్లో ఈ రెండు బిల్లులు వీగిపోయాయి. అయినా కేంద్రం తన పట్టును విడవకుండా ముందుకు సాగాలన్న యోచన లో ఉంది. ఈ బిల్లులు పాస్ కావాలంటే మూడోవంతు మెజార్టీ అవసరం. అందుకుత తగ్గ కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. ఇదే సందర్భంలో అన్ని పార్టీలతో చర్చించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలన్న ఆనవాయితీని బిజెపి ఎప్పుడో విడనాడింది. గతంలో సమస్యలు లేదా బిల్లులకు సంబంధించి ముందస్తు అఖిపలక్ష సమావేశాలు జరిగేవి. కానీ అలాంటి ఆనవాయితీని బిజెపి పాటించడం లేదు. దాదాపు 12 ఏళ్లుగా ఏకాభిప్రాయ సాధనలో మోడీ ఏనాడూ ప్రయత్నం చేయలేదు. ఇకపోతే ఏం జరుగుతుందో కూడా ప్రతిపక్షాల ఊహకు కూడా అందడం లేదు. ఈ క్రమంలో రేపటి బిల్లులను ఎప్పుడు, ఎలా ప్రవేశ పెడతారన్నది కేవలం మోడీ, అమిత్ షాలకు మాత్రమే తెలిసి ఉంటుంది. కేంద్రమంత్రులు, బిజెపి నేతలకు కూడా వీటిపై సమాచారం ఉండకపోవచ్చు. ఇలా గోప్యత పాటించడం వల్ల వచ్చే లాభం ఏమిటన్నది కూడా వారికే తెలుసు. ఇకపోతే పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కావచ్చని చూచాయగా తెలుస్తోంది. ఇదే సమయంలో సమావేశాలకు ముందుగానే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఉంటుందని సమాచారం వస్తోంది. దీంతో ఎవరు ఉంటారు, ఎవరు పోతారన్న లెక్కల్లో ఎంపిలు ఉన్నారు. ఇది కూడా మోడీ, అమిత్ షాల కనుసన్నల్లోనే జరుగుతుందనడంలో సందేహం లేదు. అందుకే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంటే దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని కీలక మంత్రిత్వ శాఖల్లో కొత్త నాయకులకు చోటు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోడీ వ్యూహరచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరుసగా ప్రధాని మోడీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడం ఈ వార్తలకు బలం చేకూరింది. బీజేపీ సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో సమూల మార్పులు చేసేందుకు పార్టీ అగ్ర నాయకత్వం జాబితాను ఖరారు చేసింది. ప్రభుత్వంతో పాటు పార్టీలో కూడా సమర్థులైన వారికి బాధ్యతలు అప్పగించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ పనితీరును మరింత వేగవంతం చేసేందుకు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్యాశాఖ బాధ్యతలు అప్పగించి, ఆ స్థానంలో శక్తికాంత దాస్‌ను తీసుకురావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అనురాగ్ ఠాకూర్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చే అవకాశం బలంగా ఉంది. పరీక్షల లీకేజీలు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని ప్రధాని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేందర ప్రధాన్‌ను తప్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. మరోవైపు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా వంటి మంత్రులు పార్టీ సంస్థాగత బాధ్యతల్లోకి వెళ్లగా, జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టు స్థానాల్లో కొత్త ముఖాలను కేబినెట్లోకి తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్,పంజాబ్ రాష్ట్రాల నుంచి మరికొందరు సమర్థ నేతలను మంత్రివర్గం లోకి తీసుకునే అవకాశం ఉంది. బెంగాల్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో అక్కడి ఎంపీలకు ప్రాధాన్యత దక్కవచ్చు. శివసేన రెబెల్ వర్గం నుంచి ఒకరిద్దరికి, ముఖ్యంగా శ్రీకాంత్ షిండేకు అవకాశం లభించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆప్ రెబెల్ ఎంపీలు రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్

పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. రానున్న రోజుల్లో జరగనున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ మార్పులు దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ త్వరలో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉండడంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లోనూ మార్పులు ఉండవచ్చు.ముఖ్యంగా తెలంగాణలో ఉన్న ఇద్దరిలో మార్పు ఉంటుందా అన్న చర్చకూడా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌కు మరో కేంద్రమంత్రి పదవి దక్కనుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టిడిపి నుంచి ఇద్దరు, బిజెపి నుంచి ఒక్కరు కేబినేట్‌లో ఉన్నారు. ఇప్పటికే ఏపీ నుండి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, మరో అదనపు పదవిని టీడీపీకి కేటాయించే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బలంగా ఉండటంతో, కేంద్రంలో మరిన్ని అవకాశాలు దక్కేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. ఒకవేళ మూడో పదవి వస్తే, అది టీడీపీ ఖాతాలోకే వెళ్తుందా లేక జనసేనకు వెళుతుందా, లేక బిజెపికే వెళుతుందా అన్నది చూడాలి. పరిణామం రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో సత్సంబంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరోవైపు, సామాజిక సమీకరణాలను బట్టి నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారవచ్చు. మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరును కూడా అధిష్టానం పరిశీలించే అవకాశం ఉంది. కొత్త వారికి అవకాశం ఇస్తారా లేదా అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. బిజెపికే ఇస్తే మహిళా ఎంపి పురంధేశ్వరికి ఛాన్స్ దక్కవచ్చని అనుకుంటున్నారు. ఒకవేళ ప్రాంతీయ సమతుల్యత పాటిస్తే, ఉత్తరాంధ్ర లేదా రాయలసీమ ప్రాంతాలకు ప్రాధాన్యత పెరిగే ఛాన్స్ ఉంది. మంత్రి పదవి దక్కితే ఏపీకి కేంద్ర నిధులు, ప్రాజెక్టుల విషయంలో మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని పార్టీ భావిస్తోంది. మొత్తంగా ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలు, మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల వ్యయహారంతో పాటు మంత్రివర్గ విస్తరణ అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. రానున్న రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. బిజెపి వ్యూహం ఎలా ఉందన్నది కూడా తెలియనుంది.



## పీ4 కార్యక్రమంతో పేదరిక నిర్మూలనే లక్ష్యం: చంద్రబాబు

**బంగారు కుటుంబాలు, మార్గదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి వెల్లడి**

**మెగా, అదానీ, టీవీఎస్ వంటి సంస్థల భాగస్వామ్యంతో పైలట్ ప్రాజెక్ట్**

**రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల బంగారు కుటుంబాల గుర్తింపు, 1.10 లక్షల మంది మార్గదర్శులు సిద్ధం**

**ఎంబీకే--10:20 నమూనా ద్వారా జీరో పావర్టీ సాధనే ధ్యేయం**

కుప్పం, జూలై 05: పేదరిక నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యంతో కూడిన శాశ్వత పరిష్కారంగా పీ4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సమాజంలో ధనిక-పేద మధ్య అసమానతలు పోవాలని, పేదల జీవితాలు బంగారు మయం కావాలనే ఉద్దేశ్యంతోనే పీ4 ద్వారా 'బంగారు కుటుంబాలు-మార్గదర్శుల' విధానాన్ని అవలంబిస్తున్నామని చెప్పారు. కుప్పం పర్యటనలో భాగంగా ఆదివారం పీ4 మార్గదర్శకులు, బంగారు కుటుంబాలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మెగా, అదానీ, టీవీఎస్ మోటార్ సైకిల్స్ సంస్థల ప్రతి ప్రతినిధులు హాజరయ్యారు. బంగారు కుటుంబాలు కేవలం ప్రభుత్వ సహాయంపై ఆధారపడే పరిస్థితిలో కాకుండా, ఆర్థికంగా ఎదిగి ఇతరులకు సైతం చేయూతనిచ్చే స్థాయికి చేరుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఇందుకోసం 'బంగారు మిత్రల' సహకారంతో ప్రతి కుటుంబం స్థితిగతులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

పీ4 కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో జీరో పావర్టీ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం సరికొత్త కార్యాచరణ చేపట్టిందని సీఎం చంద్రబాబు తెలిపారు. దీనిని 'ఎంబీకే--10:20' నమూనాగా అమలు చేస్తున్నామని, సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది ప్రజలు పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలకు అండగా నిలవాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 12 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించామని, వీరికి అండగా నిలిచేందుకు ఇప్పటివరకు 1.10 లక్షల మంది మార్గదర్శులు ముందుకు రావడం పీ4 కార్యక్రమంపై సమాజంలో ఏర్పడిన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. కేవలం ఆర్థిక సాయం అందించి వెళ్లిపోవడం కాకుండా, కుటుంబాల జీవన ప్రమాణాలను శాశ్వతంగా మెరుగుపరిచేలా మార్గనిర్దేశం చేయడమే దీని అసలు లక్ష్యమని స్పష్టం చేశారు.

కుప్పం నియోజకవర్గంలో 9 వేల బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసే బాధ్యతను అదానీ, టీవీఎస్, మెగా సంస్థలకు అప్పగించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కుటుంబాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వారి జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావడానికి సంస్థలు, మార్గదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పీ4 కార్యక్రమం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకున్న బంగారు కుటుంబాల విజయగాథలను రాష్ట్ర ప్రజలందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని, ఇలాంటి విజయాలు మరెంతో మందికి స్ఫూర్తినిస్తాయని చెప్పారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలంటే ఆదాయాలు పెరగాలని, ఆర్థిక అసమానతలు తగ్గి ప్రతి కుటుంబం మెరుగైన జీవన ప్రమాణాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో పీ4 కార్యక్రమాన్ని దేశానికే ఆదర్శంగా నిలిచే నమూనాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, కుప్పం స్థానిక నేతలు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కుప్పం రైతులతో చంద్రబాబు ఆత్మీయ భేటీ

**ఐటీసీ, విశాలాక్షి ఇన్నోవేషన్స్ సంస్థలతో కాడా ఒప్పందం**

**రైతుల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఐటీసీతో చేతులు కలిపిన ప్రభుత్వం**


**రూ.10 వేల కోట్ల పెట్టుబడులతో కుప్పంలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు**

**చిగురుగుంట వద్ద ఉన్న బంగారు గనిని త్వరలోనే వెలికితీస్తాం**

కుప్పం, జూలై 05: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పం పర్యటనలో భాగంగా స్థానిక రైతులతో ఆత్మీయ పలకరింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుప్పం ప్రాంత రైతాంగానికి విపరీతమైన మార్కెటింగ్ ప్రయోజనం చేకూర్చేలా కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) పలు ప్రతిష్టాత్మక సంస్థలతో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇక్కడి పండ్లు, కూరగాయల క్లస్టర్ల ద్వారా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాలకు స్థానిక ఉత్పత్తులను నేరుగా మార్కెటింగ్ చేసేలా ప్రముఖ ఐటీసీ (ఐజ) సంస్థతో ఒప్పందం కుదిరింది. అలాగే, రైతులు ఆధునిక వ్యవసాయ విధానాలను అనుసరించేలా కాడాతో 'విశాలక్షి ఇన్నోవేషన్స్ సస్టెయినబుల్ వ్యాల్యూ చైన్' సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ ప్రక్రియ విజయవంతంగా సాగింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అధునాతన పరికరాల ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం, మెరుగైన దిగుబడి సాధించేందుకు ఆస్కారం ఉందన్నారు. రైతులు సాంప్రదాయ పద్ధతులను వీడి ఆధునిక విధానాలను అనుసరించడంతో పాటు డిజిటల్ మార్కెటింగ్‌ను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఒప్పందంలో భాగంగా నియంత్రిత వాతావరణంలో 10 వేల టన్నుల టమాటోలను పండించి అంతర్జాతీయంగా ఎగుమతి చేసేందుకు ఐటీసీ సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసిందని, వెయ్యి ఎకరాల్లో ఈ సాగు చేపట్టేందుకు ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఇందుకోసం ఐటీసీ సంస్థ రూ.8 కోట్ల వ్యయంతో స్థానికంగా అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తుందని, కుప్పం ప్రాంత ఆదర్శ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రావాలని కోరారు.

ప్రస్తుతం పౌల్ట్రీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, కుప్పం నియోజకవర్గంలోనే దాదాపు రూ.10 వేల కోట్ల మేర వివిధ ప్రాజెక్టులు రాబోతున్నాయని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం ఏబీఐఎస్, మదర్ డెయిరీ, ఐటీసీ లాంటి అంతర్జాతీయ, ప్రతిష్టాత్మక సంస్థలు ఇప్పటికే ముందుకు వచ్చాయన్నారు. ఉద్యాన ఉత్పత్తులను సాగు చేయడంలో రాయలసీమ ప్రాంతం దేశంలోనే నెంబర్ 1 స్థాయికి చేరుకుందని కొనియాడారు. భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో దాదాపు రూ.1 లక్ష కోట్ల మేర వ్యయం చేసి భారీ ప్రాజెక్టులను తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరపున రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ప్రైవేటు రంగంలో ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టుల పెట్టుబడులు వస్తాయని వివరించారు. అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న పండ్లు, ఉద్యాన ఉత్పత్తులను సాగు చేసేలా పటిష్ట ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అలాగే చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద ఉన్న బంగారు గనిని కూడా త్వరలోనే వెలికితీసేలా తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.




# కోల్‌కతాలో అదానీ 2,000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

**కోల్‌కతా, జులై 5**

పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ పశ్చిమ బెంగాల్‌లో భారీ ఆరోగ్య ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్ ప్రాంతంలో 2,000 పడకల సామర్థ్యంతో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించనున్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. ఇందులో 1,000 పడకలను పేద రోగులకు పూర్తిగా ఉచిత వైద్య సేవల కోసం కేటాయించనున్నట్లు వెల్లడించారు. భవానీపూర్ నియోజకవర్గంలో పౌర సమాజ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ,ఈ ఆస్పత్రి నిర్మాణానికి అదానీ గ్రూప్ లిఖితపూర్వక హామీ ఇచ్చిందన్నారు. మిగిలిన 1,000 పడకలను సాధారణ వాణిజ్య వైద్య సేవల కోసం వినియోగిస్తారని తెలిపారు. అయితే ప్రాజెక్టు వ్యయం, నిర్మాణ కాలపట్టికకు సంబంధించిన వివరాలను ఇంకా వెల్లడించలేదు.ఆరోగ్య రంగంలో సామాజిక బాధ్యతలో భాగంగా అదానీ గ్రూప్ ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపడుతోంది. బీహార్‌లో అఖండ జ్యోతి ఆస్పత్రితో కలిసి కంటి వైద్య కేంద్రాన్ని ప్రారంభించగా, ఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీలో మూత్రపిండాల చికిత్స సేవల విస్తరణకు కూడా సహకరిస్తోంది. ఈ సందర్భంగా అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ చేసిన వ్యాఖ్యలను అధికారులు గుర్తుచేశారు. "ఒక వ్యక్తికి కంటిచూపును పునరుద్ధరించడం అంటే కేవలం వైద్యం అందించడం మాత్రమే కాదు, అతని జీవితంలో ఆశ, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని తిరిగి తీసుకురావడం కూడా" అని ఆయన పేర్కొన్నారు.



# నల్గొండలో ఘోర రోడ్డు ప్రమాదం..

**నల్గొండ, జులై 5**

నల్గొండ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నలుగురి ప్రాణాలను బలిగొంది. హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో అతివేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కారును వెనుక నుంచి ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఎనిమిదేళ్ల బాలుడితో పాటు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, హైదరాబాద్ వైపు ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన వేగానికి కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రత ఎంత ఘోరంగా ఉందంటే కారులో ప్రయాణిస్తున్న వారికి బయటపడే అవకాశం లేకుండా పోయింది. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో చిక్కుకున్న వారిని బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే నలుగురు మృతి చెందినట్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన కారు డ్రైవర్‌ను వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందినవారు తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన ఒకే కుటుంబ సభ్యులుగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం వారు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. కుటుంబ సభ్యుల ఆకస్మిక మృతితో బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు నల్గొండకు చేరుకున్నారు.



# అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో నూతన బ్యారక్స్ ప్రారంభం

**హైదరాబాద్, జులై 5**

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన మహిళా, పురుషుల బ్యారక్స్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి విధి నిర్వహణలో సామర్థ్యం, ఉత్సాహం మరింత పెరుగుతుందని అన్నారు. సిబ్బంది సంక్షేమం పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు.మహిళా, పురుషుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఈ బ్యారక్స్‌లో ఆధునిక వసతులు కల్పించినట్లు అధికారులు తెలిపారు. విధుల్లో నిమగ్నమయ్యే పోలీసు సిబ్బందికి సౌకర్యవంతమైన వాతావరణం అందించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. పోలీసు సంక్షేమానికి ప్రభుత్వం, పోలీసు శాఖ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని కమిషనర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపరిచే చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పోలీసు అధికారులు, అల్లాపూర్ పోలీస్ స్టేషన్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల బరిలోకి ప్రశాంత్ కిశోర్

**బంకిపూర్ ఉపఎన్నికలో పోటీ**

**ప్రత్యక్ష రాజకీయాలకు శ్రీకారం**

**బీజేపీ కంచుకోటలో ఆసక్తికర పోరు**



**పాట్నా, జులై 5**

ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారు. బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో ఆయన పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు జన్ సురాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతి అధికారికంగా ప్రకటించారు.దీంతో ప్రశాంత్ కిశోర్ రాజకీయ అరంగేట్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.బంకిపూర్ అసెంబ్లీ స్థానం బీజేపీకి దశాబ్దాలుగా కంచుకోటగా కొనసాగుతోంది.ఈ స్థానం నుంచి గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా ఉపఎన్నిక అనివార్యమైంది. జులై 30న పోలింగ్, ఆగస్టు 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ బంకిపూర్ ఉపఎన్నికను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నామని తెలిపారు. బీహార్‌లో ప్రత్యామ్నాయ రాజకీయాలకు ఈ ఎన్నిక కీలకమని పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా జన్ సురాజ్ ఉద్యమమే తన జీవిత లక్ష్యంగా మారిందని, బీహార్‌లో మార్పు తీసుకురావాలన్న సంకల్పంతోనే ఎన్నికల బరిలోకి దిగుతున్నానని చెప్పారు.తనపై విశ్వాసం ఉంచిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రశాంత్ కిశోర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో బంకిపూర్‌లో విజయం సాధించి రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడతామని ధీమా వ్యక్తం చేశారు.ఈ ఉపఎన్నికలో ప్రశాంత్ కిశోర్‌కు మద్దతు ఇస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు బీజేపీ కంచుకోటగా ఉన్న బంకిపూర్‌లో జన్ సురాజ్ అభ్యర్థిత్వం ఎన్నికల పోరును మరింత ఆసక్తికరంగా మార్చింది. ఇతర ప్రతిపక్ష పార్టీల వైఖరిపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

# దొంగ పెన్షన్లకు చెక్.. లక్ష మంది అనర్హుల తొలగింపు

**లైఫ్ అథెంటికేషన్‌తో భారీ అక్రమాలు బట్టబయలు**

**ప్రజాధనానికి రక్షణ.. అర్హులకు కొత్త అవకాశం**

**మరో 3 లక్షల మందికి సామాజిక భద్రత లక్ష్యం**



**హైదరాబాద్, జులై 5**

తెలంగాణలో సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ వ్యవస్థలో భారీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అర్హులైన నిరుపేదలకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా అనర్హులు పెన్షన్లు పొందుతున్నట్లు గుర్తించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో అనర్హుల పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించి, నిజమైన అర్హులకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రత్యేక తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, కొన్నేళ్ల క్రితమే మరణించిన లబ్ధిదారుల పేర్లు కూడా జాబితాల్లో కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. మరణించిన వారి పేర్లను తొలగించకుండా కొందరు అక్రమంగా ప్రతి నెలా పెన్షన్ నగదును పొందుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో బయటపడింది. ఈ వ్యవహారం ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టాన్ని కలిగిస్తోందని అధికారులు పేర్కొన్నారు.ఈ అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను వినియోగించింది. రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు తప్పనిసరిగా 'లైఫ్ అథెంటికేషన్' ప్రక్రియ అమలు చేయడంతో జీవించి ఉన్న లబ్ధిదారులు, మరణించిన వారి వివరాలు, ఇతర అనర్హుల సమాచారం స్పష్టంగా గుర్తించే అవకాశం లభించింది. ఈ డిజిటల్ ధ్రువీకరణతో దొంగ పెన్షన్ల వ్యవహారం బయటపడగా, వెంటనే చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గుర్తించిన లక్ష మంది అనర్హుల పేర్లను శాశ్వతంగా జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ చర్యతో ప్రతి నెలా ప్రభుత్వ ఖజానా నుంచి వృథాగా వెళ్తున్న కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా కానుందని అధికారులు భావిస్తున్నారు. సామాజిక భద్రతా పథకాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా పారదర్శక వ్యవస్థను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటున్నారు.అనర్హుల తొలగింపుతో మిగిలే నిధులను నిజమైన లబ్ధిదారులకు మళ్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రెండు లక్షల మంది కొత్త అర్హులకు పెన్షన్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుండగా, తాజాగా తొలగించిన అనర్హుల స్థానంలో మరో లక్ష మంది అర్హులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. దీంతో మొత్తం మూడు లక్షల మంది కొత్త లబ్ధిదారులకు సామాజిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణ, బడ్జెట్ కేటాయింపులపై ఆర్థిక శాఖ కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ చర్యలతో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు తదితర అర్హుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. గ్రామ, వార్డు స్థాయిలో అర్హుల గుర్తింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుండగా, తుది జాబితాను త్వరలో విడుదల చేసి కొత్త పెన్షన్ల పంపిణీ ప్రారంభించే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా ప్రభుత్వం చేపట్టిన ప్రక్షాళన కీలక ముందడుగుగా మారనుంది.

# వృద్ధురాలిని బావిలోకి తోసేసిన డిగ్రీ విద్యార్థి అరెస్ట్

**రుణాల ఒత్తిడితో దొంగతనానికి పథకం**

**నగలు దోచుకుని హత్యాయత్నం చేసిన యువకుడు**

**సీసీటీవీ, ర్యాపిడో వివరాలతో నిందితుడి అరెస్ట్**




**జగిత్యాల, జులై 5**

ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు బానిసైన ఓ డిగ్రీ విద్యార్థి డబ్బు కోసం దారుణానికి ఒడిగట్టాడు. పని ఇప్పిస్తానని నమ్మించి ఓ వృద్ధురాలిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆమె వద్ద ఉన్న బంగారం, వెండి నగలు దోచుకుని అనంతరం బావిలోకి తోసేసిన ఘటన జగిత్యాల జిల్లాలో కలకలం రేపింది. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కేసును ఛేదించారు. పోలీసుల వివరాల ప్రకారం, జగిత్యాల జిల్లా గుల్లపేట గ్రామానికి చెందిన దమ్మ దినేష్ రెడ్డి (21) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు.ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు బానిసైన అతడు దాదాపు రూ.4 లక్షలు నష్టపోయాడు. దీంతో లోన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకోగా,వాటిని వెంటనే చెల్లించాలని నిర్వాహకులు తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో డబ్బు కోసం దొంగతనానికి పథకం రచించాడు.ఈ నెల 1న కూలి పనుల కోసం లేబర్ అడ్డా వద్ద నిలబడి ఉన్న గంగాధర లక్ష్మి అనే వృద్ధురాలి వద్దకు వెళ్లిన దినేష్ రెడ్డి, పని ఇప్పిస్తానని నమ్మించి నసుల్తాపూర్ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమె వద్ద ఉన్న అర తులం బంగారం, సుమారు 20 గ్రాముల వెండి ఆభరణాలను బలవంతంగా లాక్కొని, అనంతరం ఆధారాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో వృద్ధురాలిని బావిలోకి తోసి అక్కడి నుంచి పరారయ్యాడు. బావిలో పడిపోయిన వృద్ధురాలు తీవ్ర గాయాలతో సుమారు 21 గంటలపాటు ప్రాణాలతో పోరాడింది. మరుసటి రోజు ఉదయం స్థానిక గ్రామస్తులు ఆమె అరుపులు విని బావి వద్దకు చేరుకుని బయటకు తీశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్నట్లు సమాచారం.ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. నిందితుడు ఉపయోగించిన ర్యాపిడో బుకింగ్‌కు సంబంధించిన ఫోన్ నంబర్‌ను గుర్తించి సాంకేతిక ఆధారాలతో కరీంనగర్ అమరవీరుల స్తూపం సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించిన నిందితుడు దోచుకున్న బంగారాన్ని టవర్ సర్కిల్ వద్ద వేణు మనోహరాచారి అనే బంగారం వ్యాపారికి విక్రయించి రూ.30 వేల నగదు తీసుకున్నట్లు వెల్లడించాడు. నిందితుడితో పాటు దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.



# కాంగ్రెస్ హామీలపై పోరాటం కొనసాగాలి

**: తలసాని**

**హైదరాబాద్, జులై 4**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే సమయంలో దొంగ ఓట్లను గుర్తించి తొలగించేలా కృషి చేయాలని అన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువకుడు ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రంజాన్, బతుకమ్మ, క్రిస్మస్ వంటి అన్ని పండుగలను ఘనంగా నిర్వహించామని తలసాని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అప్పులు చేసినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, ప్రస్తుత ప్రభుత్వం అప్పులు చేసినా ప్రజలకు ప్రయోజనం చేకూరే పనులు కనిపించడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించిందని, పార్టీ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు చేసిన పోరాటాన్ని ఎవరూ మరచిపోలేరని తలసాని పేర్కొన్నారు. దివంగత మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. పార్టీ నాయకులు ఐక్యంగా పనిచేస్తూ ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని తలసాని పిలుపునిచ్చారు. ఎన్నికల హామీల అమలుపై నిరంతరం పోరాటం కొనసాగించాలని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.



# ముత్యాలమ్మ సన్నిధిలో మంత్రి పొంగులేటి

**ఖమ్మం, జులై 5**

నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయానికి చేరుకున్న మంత్రి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి వారి అభిమానాన్ని చూరగొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల్లో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి తెలంగాణ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమంతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యాశాఖలో ఏకీకృత సర్వీస్ రూల్స్ త్వరలో అమలు

### లోకల్ బాడీ ఎన్నికల అనంతరం ప్రక్రియ ప్రారంభం

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి

సూర్యాపేట, జూలై 5

విద్యాశాఖలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను త్వరలో అమల్లోకి తీసుకొస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో ఈ అంశంపై సమగ్రంగా చర్చించినట్లు వెల్లడించారు. లోకల్ బాడీ ఎన్నికలు పూర్తయిన వెంటనే సర్వీస్ రూల్స్ రూపకల్పన ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ కళాశాల ఆడిటోరియంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తూము శ్రీనివాస్ రావు ఉద్యోగ విరమణ సన్మాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. విద్యాశాఖలో ఏకీకృత సర్వీస్ రూల్స్ లేకపోవడం వల్ల డిప్యూటీ డీఈవోలు, డైట్ లెక్చరర్లు, మండల విద్యాశాఖ అధికారులు తదితర పర్యవేక్షణ పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయని, దీనివల్ల విద్యా పరిపాలనతో పాటు విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని, సర్వీస్ రూల్స్ అమలుతో పదోన్నతులు, నియామకాలు, పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం త్రివేణి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సూరేపల్లి స్వరూపారాణి ఉద్యోగ విరమణ అభినందన సభలో పాల్గొని ఆమెను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమాల్లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొల్లు మధుసూదన్ రావు, ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్, సభాధ్యక్షుడు దేవరశెట్టి జనార్ధన్, ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల నరేష్, క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ బొల్లికొండ కోటయ్య, సభ్యుడు కందుకూరి శివశంకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దండుగుల యల్లయ్య, సుంకర లింగమూర్తి, గంజి శంకర్, రమేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అల్లాడి సత్యనారాయణ, మండల అధ్యక్షులు వల్లెం శంకర్ ప్రసాద్, షేక్ బషీర్‌తో పాటు పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సూర్యాపేటలో కాంగ్రెస్ బలమైన శక్తి: సర్వోత్తమ్ రెడ్డి

సూర్యాపేట, జూలై 5

సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఉందని, వచ్చే ఎన్నికల్లో తిరుగులేని మెజారిటీతో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. నూతనంగా నియమితులైన పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా మాట్లాడుతూ, గత ఎన్నికల్లో చిన్నపాటి పొరపాట్ల వల్ల అసెంబ్లీ సీటు కోల్పోయామని, అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు భారీ మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సమర్థవంతమైన నాయకత్వంతో కమిటీలను ఏర్పాటు చేశామని, పార్టీ ఇచ్చే ప్రతి ఆదేశాన్ని నాయకులు, కార్యకర్తలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు నమోదు (SIR) ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో పదవులు రాక నిరాశ చెందవద్దని, పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చకిలం రాజేశ్వరరావుతో పాటు డీసీసీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత జీవనశైలితోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్

### ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టకపోతే మానవాళి మనుగడే ప్రశ్నార్థకం

### కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్, జూలై 5



ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచ మానవాళితో పాటు సమస్త జీవజాతి మనుగడకే ముప్పుగా మారిందని, ప్రతి పౌరుడు ప్లాస్టిక్ రహిత జీవనశైలిని అలవర్చుకోవడం కాలానుగుణ అవసరమని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో "ప్లాస్టిక్ బ్యాగ్ రహిత సమాజ నిర్మాణం" లక్ష్యంగా రూపొందించిన గోడపత్రికను మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని మురికి కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడం వల్ల వాటి తొలగింపునకు మున్సిపల్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను ప్రజలు స్వీకరించాలని సూచించారు. సుస్థిరమైన హరిత జీవనశైలిని ప్రతి ఒక్కరూ అవలంబించాల్సిన అవసరం ఉందని, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు కూడా పెరుగుతుందని ఆయన హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం గ్రేటర్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని, నగర ప్రజలు వాటిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మేయర్‌ను శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శాతవాహన లయన్స్ క్లబ్ నాయకులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు లయన్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, కార్యదర్శి లయన్ నార్ల వేణుగోపాల్, కోశాధికారి లయన్ సీఏ మెరుగు ప్రవీణ్ కుమార్, లయన్ పచ్చునూరి సురేందర్, లయన్ ఎడవెల్లి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

### అనుమతులు లేకుండా తరలిస్తే కఠిన చర్యలు: మైనింగ్ ఏడీ రఘుబాబు

నూతనకల్, జూలై 5

అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) రఘుబాబు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని గుండ్ల సింగారం గ్రామ సమీపంలోని పాలేరు వాగులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ, ప్రజలు తమ వ్యక్తిగత అవసరాల కోసం ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అనుమతులు తీసుకుని మాత్రమే ఇసుకను వినియోగించాలని సూచించారు. అక్రమంగా ఇసుక నిల్వలు చేసి విక్రయించినా, అనుమతులు లేకుండా రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఆర్‌వోలు బాబు, రవి, రాంబాబు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అక్షర సేవకు జాతీయ గుర్తింపు

## 'అక్షర రత్న' జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న పోతుగంటి వీరాచారి

సూర్యాపేట/విజయవాడ, జూలై 5



తెలుగు సాహిత్యానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా సూర్యాపేటకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సామాజిక కార్యకర్త పోతుగంటి వీరాచారి ప్రతిష్ఠాత్మక 'అక్షర రత్న' జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక మరియు సవ్యసాచి గ్రూప్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. డా. కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో నిర్వహించిన 169వ అఖిల భారత ద్విశతాధిక కవి సమ్మేళనం, కృష్ణవేణి కవితోత్సవం, అక్షర రత్న పురస్కారాల ప్రధానోత్సవం సందర్భంగా ఈ అవార్డులను అందజేశారు. తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం, తెలుగు సాహిత్యం, తెలుగు కళల పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తున్న కవులు, రచయితలను ఎంపిక చేసిన జ్యూరీ, పోతుగంటి వీరాచారి రచించిన 'మట్టి పరిమళం' కవితా సంకలనాన్ని జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ, సాహిత్యానికి ప్రాధాన్యం తగ్గుతున్న ఈ కాలంలోనూ అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని తెలుగు సాహిత్యంలో సృజనాత్మకతను చాటుతూ, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు వీరాచారి చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం మాట్లాడుతూ, అక్షరాన్ని గౌరవించే కవుల మధ్య ఆత్మీయ బంధాన్ని పెంపొందిస్తూ తెలుగు సాహిత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించడమే శ్రీశ్రీ కళావేదిక లక్ష్యమని తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డా. టి. పార్థసారథి మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి 250 మందికి పైగా కవులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు. మహాకవి శ్రీనాథుని వారసుడు డా. కావూరి శ్రీనివాసశర్మ, టీడీపీ ఎన్నారై కోఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్, రంగిశెట్టి రమేష్, సినీ, సీరియల్ నటి మేకల హర్షిణి తదితరుల చేతుల మీదుగా పోతుగంటి వీరాచారికి 'అక్షర రత్న' జాతీయ ప్రతిభా పురస్కారం, జ్ఞాపిక, శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.



## కరీంనగర్ కీర్తిని ప్రపంచానికి చాటాలని యువ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు పిలుపు

కరీంనగర్, జూలై 5

కరీంనగర్‌కు చెందిన యువ బ్యాడ్మింటన్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ జిల్లాకు గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని శాతవాహన లయన్స్ క్లబ్ నాయకులు పేర్కొన్నారు. ప్రపంచ బ్యాడ్మింటన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భారత బ్యాడ్మింటన్ జట్టు సభ్యులు వైభవ్ అనసూరి, సాయి రిష్వత్ లాడేలను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా శాతవాహన లయన్స్ క్లబ్ నాయకులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, లయన్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, కరీంనగర్ మట్టిలో పుట్టిన యువ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తమ ప్రతిభను చాటుతూ భావితరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా భారత జట్టు సభ్యులుగా మలేషియా, కొరియా తదితర దేశాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారని కొనియాడారు. ఈ సందర్భంగా వైభవ్ అనసూరి, ఆయన తల్లిదండ్రులు, సాయి రిష్వత్ లాడేలను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజేతలుగా నిలిచి కరీంనగర్‌తో పాటు దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ నార్ల వేణుగోపాల్, కోశాధికారి లయన్ మెరుగు ప్రవీణ్ కుమార్, సభ్యులు లయన్ కోట సత్యం, లయన్ పచ్చునూరి సురేందర్, లయన్ ఎడవల్లి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 14 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

**మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమం**

**సామాజిక, ఆర్థిక సమానత్వమే అంబేద్కర్ ఆశయమని డీకే శివకుమార్**

**రాజ్యాంగ విలువలను ఆచరణలో పెట్టాలని పిలుపు**



బెంగళూరు, జులై 5

కర్ణాటకలోని బెంగళూరు రూరల్ జిల్లా పరిపాలన కార్యాలయ ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 14 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా పాల్గొనగా, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ కలలు కన్న సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని ప్రతి పౌరుడికి అందించడం ప్రభుత్వాలే కాకుండా సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. అట్టడుగు వర్గాలకు సమాన అవకాశాలు, న్యాయం, గౌరవం కల్పించడమే అంబేద్కర్ ఆశయమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ చూపిన మార్గాన్ని ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జిల్లా పరిపాలన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ భారీ కాంస్య విగ్రహం రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను నిరంతరం గుర్తు చేసే స్ఫూర్తి చిహ్నంగా నిలుస్తుందని డీకే శివకుమార్ తెలిపారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ మూల సూత్రాలను భావితరాలు గుర్తుంచుకునేలా ఈ విగ్రహం ప్రేరణ కల్పిస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, వాటిని పరిరక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. అంబేద్కర్ ఆలోచనలు సమాజంలో సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికి శాశ్వత మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కే.హెచ్. మునియప్ప, కే.జే. జార్జ్, ఎమ్మెల్యేలు శరత్ బచ్చేగౌడ, అనేకల్ శివన్న, ఎన్. శ్రీనివాస్, ధీరజ్ మునిరాజు, శ్రీనివాస్, ఎంపీ డాక్టర్ కె. సుధాకర్, ఎమ్మెల్సీ రవి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం ముగింపులో రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ సామాజిక సమానత్వ సాధనకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలు యువతకు స్ఫూర్తిగా నిలవాలని, సమాజంలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని వారు పేర్కొన్నారు. ఈ విగ్రహం బెంగళూరు రూరల్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపుగా నిలవడంతో పాటు రాజ్యాంగంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచుతుందని అభిప్రాయపడ్డారు.



## రౌడీ షీటర్లకు పోలీసుల హెచ్చరిక

**ముద్దనూరు పోలీస్ స్టేషన్‌కు పిలిపింపు**

**చట్టవ్యతిరేక కార్యకలాపాలపై అప్రమత్తం**

**కఠిన చర్యలు తప్పవని స్పష్టం**

కడప, జులై 4

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముద్దనూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి శాంతిభద్రతల పరిరక్షణ, చట్టపాలనపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని సమాజంలో బాధ్యతాయుతంగా జీవించాలని సూచించారు. ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. నేరాలకు దూరంగా ఉండి ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందాలని పోలీసులు సూచించారు. ప్రతి రౌడీ షీటర్ కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు.



## రెండేళ్ల పాలనపై విజయోత్సవ సభ

అనంతపురం, జులై 5

ఉరవకొండ నియోజకవర్గంలోని బెళుగుప్ప మండలం బూదిగుమ్మ గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్లు పూర్తయిన సందర్భంగా "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి,సంక్షేమం" పేరిట విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి బలమని, అదే నమ్మకంతో మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పయ్యావుల కేశవ్ అన్నారు.

## అనుమతి లేని కళాశాలల్లో చేరి మోసపోవద్దు

**తప్పుడు ప్రకటనలపై హెచ్చరిక : వీసీ సజ్జనార్**

**ఓయూ గుర్తింపు పేరుతో మోసాలకు పాల్పడుతున్న కళాశాలలపై చర్యలు**

**దోస్త్‌లో నమోదైన కళాశాలల్లోనే ప్రవేశాలు పొందాలని సూచన**

హైదరాబాద్, జులై 5

అనుమతి లేని డిగ్రీ కళాశాలల్లో చేరి మోసపోవద్దని వీసీ సజ్జనార్ ఐపీఎస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుబంధ గుర్తింపు లేకపోయినా ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులను మోసం చేస్తున్న విద్యాసంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పలు కళాశాలలపై విచారణ చేపట్టగా, కొన్ని విద్యాసంస్థలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎలాంటి అనుబంధ గుర్తింపు లేదని తేలినట్లు తెలిపారు. అయినప్పటికీ ఓయూ అఫిలియేషన్ ఉందంటూ తప్పుడు ప్రకటనలతో విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ప్రచారాలతో ప్రవేశాలు నిర్వహిస్తున్న కళాశాలలపై హైదరాబాద్ నగర పోలీసులు చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే ఇటువంటి యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'దోస్త్' ప్రవేశ ప్రక్రియలో నమోదైన,



గుర్తింపు పొందిన కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు పొందాలని సజ్జనార్ సూచించారు. ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి తమ విద్యా సంవత్సరం, కష్టార్జిత ధనాన్ని వృథా చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలు చేస్తున్న కళాశాలల సమాచారం తెలిసినా వెంటనే డయల్--100కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యా ప్రవేశాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## ఓటర్ల జాబితా సవరణలో పాల్గొన్న కేంద్ర మంత్రి

**నిమ్మాడలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ**

**ఎన్యూమరేషన్ పత్రాలు స్వీకరించి వివరాల పరిశీలన**

**ప్రజలందరూ సహకరించాలని పిలుపు**

శ్రీకాకుళం, జులై 5

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలోని తన స్వగ్రామం నిమ్మాడలో నిర్వహిస్తున్న సవరణ ప్రక్రియలో పాల్గొని బూత్ లెవల్ అధికారుల నుంచి ఎన్యూమరేషన్ పత్రాలను స్వీకరించి, అవసరమైన వివరాలను స్వయంగా పరిశీలించి పూర్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ఓటర్ల జాబితా ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. బూత్ లెవల్ అధికారి అందజేసిన ఎన్యూమరేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన రామ్మోహన్ నాయుడు, అవసరమైన వ్యక్తిగత వివరాలను నమోదు చేసి సంతకం చేసి అధికారులకు తిరిగి అందజేశారు. ఓటర్ల వివరాలు సరైన విధంగా నమోదు కావడం ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ఎంతో అవసరమని ఆయన అన్నారు. ప్రతి పౌరుడు తన వివరాలను ఒకసారి తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు.



## ఒడిశా తీరంలో చిక్కుకున్న మత్స్యకారులు క్షేమం

అమరావతి, జులై 5

ఒడిశా తీరంలో సాంకేతిక లోపంతో చిక్కుకుపోయిన విశాఖపట్నానికి చెందిన మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను ఒడిశా మెరైన్ పోలీసులు సురక్షితంగా రక్షించి ఒడ్డుకు చేర్చినట్లు వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులు కష్టాల్లో ఉన్నారన్న సమాచారం అందిన వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయక చర్యలను ప్రారంభించిందన్నారు. ఒడిశా మెరైన్ పోలీసులు, అక్కడి మత్స్యశాఖ ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ రక్షణ చర్యలను వేగవంతం చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చొరవతో పాటు ఒడిశా ప్రభుత్వ అధికారులు, మెరైన్ పోలీసుల సమిష్టి కృషి వల్లే మత్స్యకారులను సురక్షితంగా రక్షించగలిగామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో వేగంగా స్పందించిన ఒడిశా ప్రభుత్వానికి, మెరైన్ పోలీసులకు, మత్స్యశాఖ అధికారులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రక్షించబడిన మత్స్యకారులందరినీ వీలైనంత త్వరగా వారి స్వస్థలాలకు సురక్షితంగా చేర్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని మంత్రి వెల్లడించారు.


## టవర్ ఎక్కి ప్రేమ ప్రపోజల్

**చివరికి పోలీసుల రంగప్రవేశం**

**వైరల్ వీడియోతో సాహసం**

**ప్రమాదం నుంచి జంట రక్షణ**


**ప్రాణాలతో చెలగాటం వద్దని హెచ్చరిక**



పాట్నా, జులై 5

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఓ విదేశీ జంట వీడియోను అనుకరించేందుకు ప్రయత్నించిన బిహార్‌కు చెందిన ప్రేమజంట ప్రమాదంలో చిక్కుకుంది. ప్రేమ ప్రపోజల్ కోసం హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కేందుకు ప్రయత్నించగా, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఇద్దరినీ సురక్షితంగా కిందికి దింపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పోలీసుల వివరాల ప్రకారం, ఇటీవల రష్యాకు చెందిన ఓ జంట అమెరికాలోని ఎంపైర్ స్టేట్ భవనంపై ప్రేమను వ్యక్తం చేసిన వీడియో వైరల్ కావడంతో దాని స్ఫూర్తితో బిహార్‌కు చెందిన ఈ జంట కూడా అలాంటి ప్రయత్నం చేసింది. ఇందుకోసం వారు ఎత్తైన హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కడం ప్రారంభించారు.

ఈ దృశ్యాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే ప్రేమజంట టవర్‌పై ప్రమాదకరమైన ఎత్తుకు చేరుకుంది. విద్యుత్ టవర్ కావడంతో ప్రాణాపాయం ఎక్కువగా ఉండటంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు ప్రారంభించారు. పోలీసు సిబ్బంది కూడా టవర్ ఎక్కి ప్రేమజంటను నచ్చజెప్పి కిందికి దిగేలా చేశారు. ఎంతో అప్రమత్తంగా వ్యవహరించి ఇద్దరినీ సురక్షితంగా కిందికి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై స్పందించిన పోలీసులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే వీడియోలను అనుకరించే క్రమంలో ప్రాణాలను ప్రమాదంలో పడేయొద్దని సూచించారు. క్షణికావేశంలో ఇలాంటి ప్రమాదకర విన్యాసాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు కూడా ఆ జంట తీరును తప్పుబడుతున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో ప్రమాదకర చర్యలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.




## ప్రకాశ్ రాజ్‌పై చర్యలు తీసుకోవాలి

**సుమోటో కేసు నమోదు చేయాలని విష్ణువర్ధన్ రెడ్డి విజ్ఞప్తి**

**ఏపీకి వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయన్న ఆరోపణ**

**ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేపట్టాలని డిమాండ్**

అమరావతి, జులై 5


నటుడు ప్రకాశ్ రాజ్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయనపై సుమోటోగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులో విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, హిందూ ధర్మం, శ్రీరాముడు, సీతాదేవిపై కొందరు అవమానకర వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

# అత్యంత పిన్న వయసులో వైభవ్ అరంగేట్రం

**మాంచెస్టర్, జూలై 6, 2026,**

భారత క్రికెట్ చరిత్రలో 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ అరుదైన ఘనత సాధించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టి, భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన క్రికెటర్‌గా కొత్త చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో సచిన్ టెండూల్కర్, షఫాలీ వర్మ పేరిట ఉన్న రికార్డులను అధిగమించాడు. ఐర్లాండ్ పర్యటనలో అవకాశం రాకపోవడంతో పాటు ఇంగ్లండ్‌తో తొలి టీ20లో కూడా బెంచ్‌కే పరిమితమైన వైభవ్‌కు రెండో మ్యాచ్‌లో తుది జట్టులో చోటు లభించింది. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు 10 బంతుల్లో ఒక ఫోర్, ఒక సిక్సర్‌తో 14 పరుగులు చేసి తన ప్రతిభను చాటాడు. మ్యాచ్ అనంతరం వైభవ్ సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నాడు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, దేశానికి ప్రాతినిధ్యం వహించడం జీవితంలో గొప్ప అదృష్టమని పేర్కొన్నాడు. జట్టు విజయాల కోసం ఎల్లప్పుడూ అత్యుత్తమంగా కృషి చేస్తానని తెలిపాడు. అతని సందేశానికి అభిమానులతో పాటు మాజీ క్రికెటర్ల నుంచి కూడా ప్రశంసలు వెల్లువెత్తాయి. మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు చేసింది.

అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్‌కు అర్ష్‌దీప్ సింగ్ తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు తీసి శుభారంభం అందించాడు. అయితే హ్యారీ బ్రూక్ వేగవంతమైన ఇన్నింగ్స్, జాకబ్ బెథెల్ అజేయ అర్ధశతకం, టామ్ బాంటన్ విలువైన పరుగులతో ఇంగ్లండ్ లక్ష్యాన్ని చేరుకుంది. రవి బిష్ణోయ్ వేసిన 17వ ఓవర్‌లో 29 పరుగులు రావడం మ్యాచ్‌ను ఇంగ్లండ్ వైపు మలిచింది. చివరకు ఇంగ్లండ్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దైన విషయం తెలిసిందే.









# అనధికారిక టెస్టు సిరీస్ భారత్ ఏ సొంతం

**కొలంబో, జూలై 5, 2026,**



శ్రీలంక పర్యటనలో అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్న భారత్-ఏ జట్టు అనధికారిక టెస్టు సిరీస్‌ను కూడా కైవసం చేసుకుంది. శ్రీలంక-ఏతో జరిగిన రెండో అనధికారిక టెస్టులో 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌ను తన ఖాతాలో వేసుకుంది. అంతకుముందు ముక్కోణపు వన్డే సిరీస్‌ను కూడా భారత్-ఏ జట్టు గెలుచుకుంది. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ సాయి సుదర్శన్ 168 పరుగులతో మరోసారి శతకం నమోదు చేసి జట్టు భారీ స్కోరుకు పునాది వేశాడు. బౌలర్ గుర్నూర్ బ్రార్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టి మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఓవర్‌నైట్ స్కోరు 541/8తో నాలుగో రోజు ఆట ప్రారంభించిన భారత్-ఏ మరో రెండు పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక-ఏను గుర్నూర్ బ్రార్ ఆరంభంలోనే కుదేలు చేశాడు. వరుస వికెట్లు తీస్తూ ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. సరాన్ష్ జైన్ కూడా రెండు వికెట్లు తీసి సహకరించడంతో శ్రీలంక-ఏ 209 పరుగులకే ఆలౌటైంది. విజయ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్-ఏ వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని చేరుకుని 10 వికెట్ల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో కూడా శ్రీలంక-ఏను భారత బౌలర్లు కట్టుదిట్టంగా నియంత్రించారు. కెప్టెన్ సహన్ అరాచ్చిగా 127 పరుగులతో శతకం సాధించినప్పటికీ, మిగతా బ్యాటర్లను ఎక్కువసేపు నిలవనీయలేదు. గుర్నూర్ బ్రార్, సరాన్ష్ జైన్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టడంతో శ్రీలంక-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 366 పరుగులకే పరిమితమైంది. దీంతో భారత్-ఏ మరో ట్రోఫీని తన ఖాతాలో వేసుకుని పర్యటనను విజయవంతంగా ముగించింది.

# లోపాలు సరిదిద్దుకోవాలి

## లియోనెల్ మెస్సీ

**అట్లాంటా, జూలై 6, 2026,**

ఫిఫా ప్రపంచకప్-2026 ప్రిక్వార్టర్స్‌కు అర్జెంటీనా చేరుకున్నప్పటికీ, జట్టు ప్రదర్శనపై కెప్టెన్ లియోనెల్ మెస్సీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. కాబో వెర్డ్‌పై విజయం సాధించినా ఆటలో అనేక లోపాలు కనిపించాయని, తదుపరి మ్యాచ్‌కు ముందు వాటిని తప్పకుండా సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశాడు.

కాబో వెర్డ్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో అర్జెంటీనా 3-2 తేడాతో విజయం సాధించి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించింది. అయితే ఈ విజయంతో సంతృప్తి చెందలేమని మెస్సీ పేర్కొన్నాడు.

మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ, తదుపరి దశకు చేరుకోవడం మాత్రమే సరిపోదని, జట్టు చేసిన తప్పులను సరిదిద్దుకోవడం మరింత ముఖ్యమని అన్నాడు. కాబో వెర్డ్ బలమైన జట్టేనని ముందే తెలుసని, తొలి గోల్ చేసిన తర్వాత ఆట తమ ఆధీనంలోకి వస్తుందని భావించినప్పటికీ బంతిపై నియంత్రణ కోల్పోయామని వివరించాడు. ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమవడంతో కాబో వెర్డ్ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందని చెప్పాడు.

ప్రపంచకప్ వంటి నాకౌట్ టోర్నీల్లో ప్రతి జట్టు చివరి వరకు పోరాడుతుందని, ఏ మ్యాచ్ కూడా సులభం కాదని మెస్సీ అభిప్రాయపడ్డాడు. ప్రిక్వార్టర్స్‌లో అర్జెంటీనా జూలై 7న అట్లాంటా వేదికగా ఈజిప్టుతో తలపడనుంది.




# సంజును మర్చిపోవద్దు

యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి అంతర్జాతీయ అరంగేట్రం లభించడం సంతోషకరమైన విషయమే అయినప్పటికీ, స్టార్ ఓపెనర్ సంజు శాంసన్‌ను విస్మరించవద్దని మాజీ భారత క్రికెటర్ అంబటి రాయుడు అభిప్రాయపడ్డాడు. ఇంగ్లండ్‌తో రెండో టీ20లో సంజు స్థానంలో వైభవ్‌కు అవకాశం ఇవ్వడంపై సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆయన స్పందించారు.

## : అంబటి రాయుడు

**మాంచెస్టర్, జూలై 6, 2026,**

సామాజిక మాధ్యమం వేదికగా రాయుడు మాట్లాడుతూ, టీ20 ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన సంజు శాంసన్ ప్రతిభను ఎవరూ తక్కువ అంచనా వేయొద్దన్నారు. వైభవ్ అరంగేట్రాన్ని అందరూ ఆనందించాల్సిందేనని, అదే సమయంలో సంజు చేసిన సేవలను కూడా గుర్తుంచుకోవాలని సూచించారు. వైభవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అతడు భారత జట్టుకు ఎన్నో ఏళ్లు సేవలందించాలని ఆకాంక్షించారు. ఐర్లాండ్ సిరీస్‌తో పాటు ఇంగ్లండ్‌తో తొలి టీ20లో సంజు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో జట్టు యాజమాన్యం రెండో మ్యాచ్‌కు అతడిని పక్కన పెట్టింది. అతని స్థానంలో అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ 10 బంతుల్లో 14 పరుగులు చేసి తన దూకుడు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నప్పటికీ, ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. దీంతో సంజును తప్పించడం సరైందా అనే అంశంపై క్రికెట్ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.




# మళ్లీ బాబర్‌కే టెస్టు పగ్గాలు

**లాహోర్, జూలై 6, 2026,**

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. టెస్టు జట్టు కెప్టెన్‌గా బాబర్ ఆజాంను మళ్లీ నియమిస్తూ వెస్టిండీస్, ఇంగ్లండ్ పర్యటనల కోసం జట్టును ప్రకటించింది. గతంలో టెస్టు కెప్టెన్సీ నుంచి తప్పుకున్న బాబర్ మూడేళ్ల తర్వాత మరోసారి జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. షాన్ మసూద్ సారథ్యంలో పాకిస్థాన్ జట్టు వరుస పరాజయాలు ఎదుర్కొనడంతో కెప్టెన్సీ మార్పు అనివార్యమైంది. మసూద్ నాయకత్వంలో జట్టు 16 టెస్టుల్లో 12 మ్యాచ్‌లు ఓడిపోవడంతో పాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లోనూ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. దీంతో అభిమానులు, మాజీ క్రికెటర్లు కెప్టెన్సీ మార్పు కోరుతూ విమర్శలు గుప్పించారు.




# ‘ఫౌజీ’ రషెస్ చూసి ఆశ్చర్యపోయా..

## నిర్మాత నాగవంశీ వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 5, 2026 --

ప్రభాస్ కథానాయకుడిగా, హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న హిస్టారికల్ పీరియడ్ వార్ అండ్ లవ్ డ్రామా లిలి‘ఫౌజీ’లిలిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రాన్ని 2026 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. తాజాగా ఈ చిత్రంపై ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచాయి. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ తనకు ‘ఫౌజీ’ చిత్రానికి సంబంధించిన కొన్ని రషెస్ చూపించారని, వాటిని చూసిన తర్వాత తాను ఆశ్చర్యానికి గురయ్యానని తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఊహించని స్థాయిలో, అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తున్నారని ఆయన ప్రశంసించారు. నాగవంశీ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభాస్ అభిమానులు వెంటనే టీజర్ లేదా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేయాలని కోరుతున్నారు. ఈ చిత్రం ద్వారా సోషల్ మీడియా సెన్సేషన్ ఇమాన్వి కథానాయికగా వెండితెరకు పరిచయం కానుంది.


## ‘అయ్యగారే నెం.1’ నినాదంపై

# అఖిల్ స్పందన..



హైదరాబాద్, జూలై 5, 2026 --

అఖిల్ అక్కినేని హీరోగా నటిస్తున్న ‘లెనిన్’ చిత్రం జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న అఖిల్, తన సినీ ప్రయాణం, అభిమానులతో ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాజా ఇంటర్వ్యూలో సోషల్ మీడియాలో వైరల్ అయిన ‘అయ్యగారే నెం. 1’ నినాదంపై స్పందించిన అఖిల్, అభిమానులు తనపై చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక అభిమాని ఇచ్చిన ఈ పిలుపు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. “ఎక్కడికి వెళ్లినా అందరూ ‘అయ్యగారు’ అని పిలుస్తున్నారు. నాన్న నాగార్జునకు ‘కింగ్’ అనే గుర్తింపు ఉన్నట్లే, నాకు ‘అయ్యగారు’ అనే పేరు అభిమానుల ప్రేమతో వచ్చింది. ఇది నాకు ఎంతో ప్రత్యేకం” అని అఖిల్ తెలిపారు.




## కళ్యాణ్ రామ్ పుట్టినరోజు కానుకగా ఫస్ట్‌లుక్ విడుదల

హైదరాబాద్, జూలై 5, 2026 --

నందమూరి కళ్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న భారీ మల్టీస్టారర్ చిత్రం ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

విడుదల చేసిన పోస్టర్‌లో కళ్యాణ్ రామ్ సంప్రదాయ దుస్తుల్లో సరికొత్త లుక్‌లో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సంగీతాన్ని జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తుండగా, కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు.

ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి సామాజిక మాధ్యమాల వేదికగా కళ్యాణ్ రామ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తన తొలి చిత్రం పటాస్ ద్వారా దర్శకుడిగా అవకాశం ఇచ్చి తనపై నమ్మకం ఉంచిన తొలి హీరో కళ్యాణ్ రామ్ అని గుర్తు చేసుకున్నారు. ఈ సినిమాలో ఆయనను కొత్త కోణంలో ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే ఈ చిత్రం 2027 సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుందని ఆయన వెల్లడించారు. పటాస్ తర్వాత కళ్యాణ్ రామ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కావడం, ఇందులో వెంకటేష్ కూడా కీలక పాత్ర పోషిస్తుండటంతో ఈ సినిమాపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.



## బాలీవుడ్‌లోకి

# పరశురామ్..

### హృతిక్ రోషన్‌తో భారీ పాన్ ఇండియా సినిమాకు సన్నాహాలు?

హైదరాబాద్, జూలై 5, 2026 --

గీత గోవిందం చిత్రంతో టాలీవుడ్‌లో స్టార్ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న పరశురామ్ త్వరలో బాలీవుడ్‌లో అడుగుపెట్టనున్నారనే వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం ఆయన బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కోసం భారీ పాన్ ఇండియా కథను సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 2008లో యువత సినిమాతో దర్శకుడిగా పరిచయమైన పరశురామ్, అనంతరం ఆంజనేయులు, సోలో వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. అయితే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన గీత గోవిందం ఆయనకు దర్శకుడిగా భారీ గుర్తింపు తీసుకొచ్చింది. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబుతో తెరకెక్కించిన సర్కారు వారి పాట వాణిజ్యపరంగా విజయాన్ని సాధించినప్పటికీ విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన అందుకుంది. అనంతరం విజయ్ దేవరకొండతో రూపొందించిన ది ఫ్యామిలీ స్టార్ ఆశించిన విజయాన్ని అందుకోలేదు. దీంతో గత రెండేళ్లుగా కొత్త కథల రూపకల్పనపైనే పరశురామ్ దృష్టి సారించారు. సినీ వర్గాల సమాచారం ప్రకారం, హృతిక్ రోషన్‌కు సరిపోయేలా యాక్షన్, భావోద్వేగాలతో కూడిన బలమైన కథను ఆయన సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కథాంశాన్ని హృతిక్‌కు వినిపించగా, ఆయన కూడా ఆసక్తి వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాన్ని కేవలం హిందీ ప్రేక్షకులకే కాకుండా దక్షిణాది ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని పాన్ ఇండియా స్థాయిలో నిర్మించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబాలే ఫిల్మ్స్ నిర్మించే అవకాశమున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. కేజీఎఫ్, కాంతార, సలార్ వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన హోంబాలే ఫిల్మ్స్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లను తెరకెక్కిస్తోంది. ఇటీవల సూర్యతో కొత్త సినిమాను ప్రకటించిన ఈ సంస్థ, ఇప్పుడు పరశురామ్--హృతిక్ రోషన్ కాంబినేషన్‌ను కూడా కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.



‘ఓరి దేవుడా’ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి మిథిలా పాల్కర్ మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారారు. తాజాగా ఆమె పంచుకున్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటూ నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. తెలుగులో ఒకే ఒక్క సినిమా చేసినప్పటికీ, తన క్యూట్ స్మైల్, సహజమైన నటనతో మిథిలా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ‘ఓరి దేవుడా’ చిత్రంలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది.

## ‘ఓరి దేవుడా’ హీరోయిన్

# మిథిలా పాల్కర్

2014లో మరాఠీ షార్ట్ ఫిల్మ్‌తో నటిగా కెరీర్ ప్రారంభించిన మిథిలా, అనంతరం హిందీ, మరాఠీ చిత్రాలతో పాటు వెబ్ సిరీస్‌ల్లోనూ తన ప్రతిభ చాటుకున్నారు. మరాఠీ చిత్రం లిలి‘మురాంబ’లిలికు గాను ఫిల్మ్‌ఫేర్ మరాఠీ అవార్డును అందుకున్నారు. ‘కారవాన్’ చిత్రం, ‘లిటిల్ థింగ్స్’ వెబ్ సిరీస్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన మిథిలా, పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను కూడా అందుకున్నారు. ముఖ్యంగా ఓటీటీ వేదికల్లో ఆమెకు ప్రత్యేక అభిమాన వర్గం ఏర్పడింది. ప్రస్తుతం సినిమాలతో పాటు ఫ్యాషన్ రంగంలోనూ బిజీగా ఉన్న మిథిలా, సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు తన కొత్త ఫొటోలు, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తాజాగా ఆమె షేర్ చేసిన స్టైలిష్ ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటూ వైరల్ అవుతున్నాయి. ఇటీవల అక్షయ్ కుమార్ నటించిన ‘భూత్ బంగ్లా’ చిత్రంలోనూ మిథిలా కీలక పాత్రలో కనిపించారు. ప్రస్తుతం ఆమె తాజా ఫొటోషూట్ సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశంగా మారింది.

# ఆమిర్ ఖాన్ వివాహం?..



బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్, ఆయన సన్నిహితురాలు గౌరీ స్ప్రాట్ వివాహం చేసుకున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ముంబైలోని బాంద్రాలో ఉన్న ఆమిర్ ఖాన్ నివాసంలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరిద్దరూ వివాహం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం తమ వివాహాన్ని అధికారికంగా నమోదు చేసుకున్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోల్లో ఆమిర్ ఖాన్ వివాహ పత్రాలపై సంతకం చేస్తున్నట్లు కనిపిస్తుండగా, గౌరీ స్ప్రాట్ సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తున్నారు. వైరల్ చిత్రాల ప్రకారం, ఈ కార్యక్రమానికి ఇరు కుటుంబాలకు చెందిన సభ్యులు కూడా హాజరైనట్లు తెలుస్తోంది. గౌరీ స్ప్రాట్ తన కుమారుడితో, ఆమిర్ ఖాన్ కుమారుడు ఆజాద్ రావ్ ఖాన్‌తో కలిసి వేడుకలో పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉంగరాల పెట్టెలతో పిల్లలు కనిపించిన దృశ్యాలు కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా పంచుకుంటున్నారు. అయితే, ఈ వివాహానికి సంబంధించిన వార్తలు, వైరల్ ఫొటోలపై ఇప్పటివరకు ఆమిర్ ఖాన్ లేదా గౌరీ స్ప్రాట్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఈ ప్రచారంపై స్పష్టత రావాల్సి ఉంది. గత మార్చిలో తన 60వ పుట్టినరోజు సందర్భంగా గౌరీ స్ప్రాట్‌తో తన బంధాన్ని ఆమిర్ ఖాన్ బహిరంగంగా పరిచయం చేశారు. అలాగే జూలై 5న సాదాసీదా కుటుంబ వేడుకలో వివాహం జరుపుకోనున్నట్లు కూడా వెల్లడించిన విషయం తెలిసిందే.

“This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467